# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 14 మే 2025 | HYDERABAD




## దమ్ముంటే స్థానిక ఎన్నికలు పెట్టండి

ప్రజాక్షేత్రంలోకి పోవడానికి భయమెందుకు

కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే సబితారెడ్డి సవాల్

IVలో



సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఐదు నిమిషాలు లేటుగా వచ్చిన పది మంది విద్యార్థులను అనుమతించలేదు, ఓ విద్యార్థిని ప్రహరీ దూకి వెళ్లబోతుంటే పోలీసులకు అప్పగించారు.

# కోర్టులు చెప్పినా.. కేసులు పెట్టినా
# కదలరు.. వదలరు..

## బంజారాహిల్స్‌లోని ప్రభుత్వ స్థలంపై కబ్జారాయుళ్ల కన్ను

### హెచ్చరిక బోర్డులు తొలగించి

### పదే పదే ఆక్రమణకు యత్నం

***కోర్టు తీర్పులు ఖాతరు చేయడం లేదు. రెవెన్యూ విభాగం హెచ్చరికలను అస్సలు పట్టించుకోవడం లేదు. పోలీసులు కేసులు నమోదు చేసినా బెదరడం లేదు. నగరం నడిబొడ్డున ఉన్న సర్కారు స్థలాన్ని అక్రమంగా చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ఓ కబ్జారాయుడు పదే పదే ప్రయత్నం చేస్తున్నాడు. ఏకంగా అధికారులకే సవాల్ విసురుతున్నాడు. సర్కారు స్థలమని అధికారులు బోర్డు పెట్టిన మరుక్షణమే.. ఆ బోర్డును తొలగిస్తున్నాడు. ఆ స్థలం తనదిగా ప్రచారం చేసుకుంటున్నాడు. నగరం నడిబొడ్డున 300 కోట్ల విలువైన సర్కారు స్థలం కథ ఇది.***

*- బంజారాహిల్స్,మే 13:*

### నకిలీ పత్రాలతో భూకబ్జాలకు ..

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా 3.2 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఇది షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నెంబర్ 403/పీ లోకి వచ్చే టీఎస్ నెంబర్ 111, బ్లాక్- హెచ్, వార్డు-10లో 20 ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలంలో భాగంగా ఉంది. ఇందులో నుంచి ఒక ఎకరం స్థలాన్ని 1998లో తట్టిఖానా సెక్షన్ జలమండలి రిజర్వాయర్‌ను నిర్మించారు. 1999లో మరో 1.20 ఎకరాల స్థలాన్ని కూడా జలమండలి కోసం కేటాయించారు. కాగా, ఈ రెండు స్థలాల మధ్యన సుమారు 3.20 ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలం ఉంది. అయితే జలమండలికి కేటాయించిన 1.20 ఎకరాల స్థలంతో పాటు ఖాళీగా ఉన్న 3.20 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని గత కొన్నేళ్లుగా బోగస్ పత్రాలతో పరుశరామ్ పార్థసారథి అనే వ్యక్తి కాజేసేందుకు పలు రకాలైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ స్థలం సర్వే నెంబర్ 403/52/పీగా పేర్కొంటూ సదరు స్థలంలో తిష్టవేయగా షేక్‌పేట రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదులతో మూడేళ్ల క్రితం పార్థసారథిపై ఫోర్జరీతో సహా పలు సెక్షన్ల కింద బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు.




బంజారాహిల్స్ రోడ్ నం 10లో జలమండలి కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు




తాజాగా హెచ్చరిక బోర్డును తొలగించిన దృశ్యం

### ఆ భూమి సర్కారుదే

గత ఏడాది డిసెంబర్‌లో, ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు పార్థసారథి గ్యాంగ్ యత్నిస్తున్న వ్యవహారంపై నమస్తే తెలంగాణ వరుస కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం, జలమండలి ఉన్నతాధికారులు రంగంలోకి దిగిన స్థలాన్ని కాపాడారు. జలమండలికి ఇచ్చిన 1.20 ఎకరాల స్థలంలో విజిలెన్స్ విభాగం నిఘా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా నెలరోజుల క్రితం పార్థసారథి సిటీ సివిల్ కోర్టులో వేసిన కేసులో 1.20 ఎకరాల స్థలం జలమండలిదే అని తీర్పు వచ్చింది.

### బోర్డు పెట్టగానే తొలగించి..

రెవెన్యూ ఆధీనంలో ఉన్న మూడెకరాల ప్రభుత్వ స్థలంలో కాగా వారం రోజులుగా కొంతమంది వ్యక్తులు ప్రవేశించడంతో పాటు స్థలం బయట ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు తొలగించారు. స్థలం బయట ఉన్న షీట్లపై రాసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను సైతం తుడిచివేశారు. స్థలం లోపల వేట కుక్కలను పెట్టుకుని బయటి వ్యక్తులు రాకుండా గేట్లు పెట్టుకున్నారు. స్థానికులు లోపలికి వస్తే దాడులకు తెగబడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థలం తమదే అని, అందుకే పొసెషన్‌లో తమ మనుషులే ఉన్నారంటూ బిల్డర్లను నమ్మించి అడ్వాన్సులు దండుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా నగరం నడిబొడ్డున ఖరీదైన స్థలంలోకి పలుమార్లు చొచ్చుకు వచ్చి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న ప్రైవేటు వ్యక్తుల ధీమాకు కారణం ఏమిటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల మద్దతుతోనే ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఖరీదైన ప్రభుత్వ స్థలంలోకి ప్రైవేటు వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### మళ్లీ బోర్డులు ఏర్పాటు చేస్తాం

బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా.. జలమండలి రిజర్వాయర్ పక్కనున్న స్థలం సర్వే నెంబర్ 403/పీ లోకి వచ్చే టీఎస్ నెంబర్ 111, బ్లాక్- హెచ్, వార్డు-10లోనిది. ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదే. ఈ స్థలంలోకి ఎవరు ప్రవేశించినా చర్యలు తప్పవు. నాన్ ఎగ్జిస్టింగ్ సర్వేనెంబర్లతో బోగస్ పత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్న వారిపై గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఇటీవల ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు తొలగించారన్న సమాచారం రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి తగు చర్యలు తీసుకుంటాం.

**-అనితారెడ్డి, షేక్‌పేట తహసీల్దార్**



స్థలం వెనుక వైపు బోర్డును చెరిపేసిన దృశ్యం





## సుందరీమణుల హెరిటేజ్ వాక్

### చార్మినార్ వద్ద ముద్దుగుమ్మల సందడి

**ఓల్డ్‌సిటీ వీధుల్లో** మిస్ వరల్డ్ సుందరీమణులు హెరిటేజ్ వాక్‌లో భాగంగా చార్మినార్ వద్ద సందడి చేశారు. చార్మినార్ వద్ద ఫొటోషూట్‌కు హాజరైన సుందరాంగులు, ఈ చరిత్రాత్మక వేదిక నుంచి అభివాదం చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. చార్మినార్ సమీపంలోని ప్రసిద్ధ చుడీ బజార్ (లాడ్ బజార్)లో కంటెస్టెంట్స్ గాజులు, ముత్యాల హారాలు, ఇతర అలంకరణ వస్తువుల షాపింగ్ చేశారు. హస్తకళల పై ఆసక్తిని ప్రదర్శించారు. అనంతరం ముద్దుగుమ్మలు చౌమహల్లా ప్యాలెస్‌కు చేరుకుని ప్యాలెస్‌లో ఉన్న నిజాం సంపద, యుద్ధ సామగ్రిని సందర్శించారు. కంటెస్టెంట్స్‌కు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్ గౌడ్, హీరో నాగార్జున, హీరోయిన్ శ్రీలీల హాజరయ్యారు. చార్మినార్ విశిష్టతను, ఆర్కిటెక్ట్ విధానాన్ని ఇంటాక్ కన్వీనర్ అనురాధ రెడ్డి వివరించారు. - సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ)





## బిల్డ్ నౌ అమలయ్యేనా!

- 11 జిల్లాలకు పెరిగిన హెచ్ఎండీఏ పరిధి
- గందరగోళంగా భవన నిర్మాణ పర్మిషన్స్
- సాంకేతిక కారణాలతో నిలిచిన ప్రక్రియ
- దరఖాస్తు దారులకు తప్పని ఇక్కట్లు

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ) : ఏడు జిల్లాల నుంచి 11 జిల్లాలకు హెచ్ఎండీఏ పరిధి పెరిగినా.. భవన నిర్మాణ అనుమతులు విధానం ఇంకా గందర గోళంగానే ఉంది. బిల్డ్ నౌ అందుబాటులోకి తీసుకువస్తున్నామంటు రెండు వారాల కిందటే ప్రకటించిన హెచ్ఎండీఏ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయకలేకపోతుంది. దీంతో కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగానికి ఇదొక గుదిబండలా మారుతుంది. సంస్కరణల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు భవన నిర్మాణ రంగాన్ని మరింత దారుణంగా మారుస్తున్నాయి. రోజుల వ్యవధిలో అనుమతులు జారీ చేసే టీఎస్ బీపాస్ విధానానికి ఫుల్ స్టాప్ పెట్టి బిల్డ్ నౌ తీసుకువచ్చిన ప్రభుత్వం.. అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో హెచ్ఎండీఏలో అనుమతుల ప్రక్రియ అయోమయానికి దారితీస్తోంది. ఏడాది కాలంగా దీనిపై కసరత్తు చేస్తున్నా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడం ఆ రంగానికి సమస్యగా మారుతుంది. పూర్తి స్థాయిలో బిల్డ్ నౌ కార్యకలాపాలు మొదలుకాకపోవడంతో హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

### ఏర్పాట్లలో కాంగ్రెస్ విఫలం..

ఏఐ ఆధారిత వ్యవస్థతో వేగంగా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సంస్కరిస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు తగినట్లుగా ఏర్పాట్లను చేయడంలో విఫలమైంది. చకచకా అనుమతులు దేవుడెరుగు కనీసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లేకుండా పోయింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతుల ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే వేగంగా పూర్తి చేసేలా టీఎస్ బీపాస్ తీసుకువచ్చి.. సమర్థవంతంగా అమలు చేసింది. ఇన్నాళ్లు దీని ఆధారంగా అనుమతులు కూడా మంజూరు చేసింది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ టీఎస్ బీపాస్ లోపభూయిష్టంగా ఉందని, మరింత పారదర్శకత, వేగవంతమైన అనుమతుల కోసం బిల్డ్ నౌ ప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో కొత్త విధానం పూర్తి స్థాయిలో సిద్ధం కాకుండానే, పాత విధానాన్ని నిలిపివేయడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. 11 జిల్లాలకు విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో ఏప్రిల్ మొదటివారంలోనే బిల్డ్ నౌ మిగతా IIవ పేజీలో






## మల్టీలెవల్ పార్కింగ్ @ చార్మినార్

- పీపీపీ విధానంలో కాంప్లెక్స్ నిర్మాణం
- ఏజెన్సీల నుంచి టెండర్లు కోరిన జీహెచ్ఎంసీ
- ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ప్రధాన పర్యాటక ప్రాంతమైన చార్మినార్ వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా జీహెచ్ఎంసీ అడుగులు వేస్తోంది. చార్మినార్ చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో... కుటుంబ సమేతంగా, స్నేహితులతో కలిసి పర్యాటకులు వస్తుంటారు. అయితే.. ఇలా వచ్చే వాళ్లను ఏళ్ల తరబడి పార్కింగ్ సమస్య వెంటాడుతూనే ఉంది. నగరం నడిబొడ్డున చార్మినార్ ఉండటం, స్ట్రీట్ షాపింగ్‌తో పాటు నిత్యం పర్యాటకుల రద్దీ అధికంగా ఉండటం.. వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలం లేక పర్యాటకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే వీటికి చెక్ పెట్టేందుకు చార్మినార్ వద్ద మల్టీలెవల్ మిగతా IVవ పేజీలో

## బతుకమ్మకుంట చెరువే కాదు!

- నాగమయ్యకుంట నుంచి నీళ్లు వచ్చేవి..
- సాగు చేసే వాళ్లం.. ఇటుకబట్టీలు పెట్టేది
- రికార్డుల్లో డ్రైల్యాండ్‌గానే నమోదైంది



IVలో

- కోర్టు తీర్పును ఖాతరు చేయని హైడ్రా
- పార్టీ మారాలన్న సీఎం.. బీఆర్ఎస్‌లోనే ఉంటా
- అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి

## సదుపాయాలు కల్పించండి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, మే 13: ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం మౌలాలి, నేరేడ్‌మెట్ డివిజన్‌లో అధికారులతో కలిసి పాదయాత్ర చేసి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధురానగర్‌లోని డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్‌లో ఓల్టేజ్, విద్యుత్ దీపాల సమస్యలు పరిష్కరించాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలో పరికరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పక్కకు జరిపి ఎత్తు పెంచాలన్నారు. మారుతీనగర్‌లో ఆధునిక డ్రైనేజీ, సీసీ రోడ్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వరద నీరు ప్రవహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, డీఈ మహేశ్, ఏఈ సృజన, జలమండలి డీజీఎం రాజు ఏఈ నవీన్, ఎలక్ట్రికల్ ఏఈ లక్ష్మి, స్ట్రీట్ లైట్స్ ఏఈ వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వెంకన్న, జీకే హనుమంత రావు, శివ కుమార్, మధుసూదన్ రెడ్డి, శ్రీను, శంకర్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, సుధీర్, రాజు, అవినాశ్, నవీన్, వినీత్, సందీప్, శోభ, మధుర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, రవీంద్ర, దేవరాజ్, సూర్యనారాయణ, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, మనోజ్, వినీత్, నాగభూషణం కిరీట్ రెడ్డి, అమీనుద్దీన్ సత్యనారాయణ, భాగ్యనంద్, ఉస్మాన్, శైలేందర్, మారుతి ప్రసాద్, సంతోష్ గుప్తా, దినేశ్, మహేశ్, రాజశేఖర్ రెడ్డి, వంశీ, నవాబు, నర్సింగరావు, ఈస్ట్ మారుతి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షులు కుమార్, ప్రధాన కార్యదర్శి మాధవాచారి, సాయికుమార్, కోటేశ్వరరావు నర్సింగ్ రావు ప్రసాద్, సయ్యద్, రామకృష్ణ, రెహమాన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలి డివిజన్‌లో పర్యటించి నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి